క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామలాకుమారి

రేగిడి: రేగిడి ఎంపీడీవోగా జి.వి.ఆర్.ఎస్.వి. శ్యామలాకుమారి బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఎల్.ఎన్.పేట ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్డీవోగా పనిచేసిన ఈమె పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ, సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆమె అన్నారు.

నకిలీ పురుగుమందులు విక్రయిస్తే చర్యలు

రేగిడి: నకిలీ పురుగుమందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని బూరాడ, పనసలవలస గ్రామాల్లోని ఫెర్టిలైజర్స్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన పురుగుమందులు, వాటి కాలపరిమితి వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులు సూచించిన పురుగుమందులు, ఎరువులు, విత్తనాలను మాత్రమే విక్రయించాలని, రైతులను మోసం చేయొద్దన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రేగిడి: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని వైకేపీ ఏసీ ఎ.చిరంజీవి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో సమావేశమైన ఆయన స్త్రీనిధి, ఎస్పీఈపీ, పీఎంఈజీపీ తదితర రుణాలపై సమీక్షించారు. డ్వాక్రా గ్రూపుల సంఖ్యను పెంచాలని, మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం మంజూరు చేసిన రుణాల లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం టి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


లోన్‌యాప్, సైబర్‌మోసాలపై అవగాహన



సైబర్ మోసాల బారినపడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: మండలంలోని కొర్లవలస, మునకలవలస, బాలకవివలస తదితర గ్రామాల్లో లోన్ యాప్‌లు, సైబర్ మోసాల బారినపడకుండా ఉండడంపై సోమవారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతిఒక్కరూ ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంకు ఖాతాల వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ ఎవరికీ చెప్పవద్దని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన వెంట ఏఎస్ఐ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

చాటాయివలసలో 'పొలంబడి'



చాటాయివలస పొలాల్లో పొలంబడి కార్యక్రమ నిర్వహణలో అధికారులు

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ మిత్రపురుగులు, శత్రుపురుగుల గురించి, రైతులకు వివరించారు. మిత్రపురుగులతో పంటలకు ఎంతోమేలు జరుగుతుందన్నారు. పొలంలో శత్రుపురుగు ఆకర్షణ బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. రసాయనిక ఎరువులు వినియోగించకుండా సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు, యూనిట్ ఐసీఆర్పీ కె.రమణ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో రైతులకు మేలు



భూముల రీసర్వే ప్రయోజనాలను వివరిస్తున్న తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి

రేగిడి: భూముల రీసర్వేతో రైతులకు మేలు జరుగుతోందని తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి అన్నారు. మండలంలోని వన్నలి గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వేను సోమవారం పరిశీలించిన ఆయన అక్కడి రైతులతో కాసేపు మాట్లాడారు. రైతుల మధ్య ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ తగాదాలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సర్వే చేస్తోందని, దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్వే సమయంలో రైతులు దగ్గరుండి తమ భూముల కొలతలు సరిచూసుకోవాలని, ఏవైనా తప్పులుంటే ఆధారాలతో వస్తే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రమణ, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శంబంగి, ఎంపీ బెల్లాన తదితరులు

- పణుకువసలో రూ.2.22 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభం
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

తెర్లాం: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పణుకువలస గ్రామంలో రూ.2.22 కోట్ల వ్యయంతో చేపట్టిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, తారురోడ్డు నిర్మాణాలతో పాటు, రక్షిత మంచినీటి పథకాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లతో కలిసి జెడ్పీ చైర్మన్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన ఆయన అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమని అందుకే ఆయన ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. అలాగే అన్ని వర్గాలు బాగుండాలని చెప్పి, ప్రతీ వర్గానికి మేలు జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఎన్నికల వేళ లేనిపోని హామీలతో ప్రజలను బురిడీ కొట్టించేందుకు టీడీపీ నేతలు సిద్ధమవుతున్నారని, వారిని అస్సలు నమ్మవద్దన్నారు. సత్యశీలుడు, నీతిమంతుడు, అవినీతి మచ్చలేని ఏకైక నాయకుడని ప్రగల్భాలు పలికే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయి అరెస్టయి, జైలుపాలయ్యారన్నారు. ఇదే ఆయన అవినీతి పాలనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని బోగస్ కంపెనీలను సృష్టించి, ఏకంగా రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని, దీనిని సీఐడీ అధికారులు బట్టబయలు చేశారన్నారు. గతంలో ఆయన ఎన్నో కేసుల్లో స్టేలు తెచ్చుకుని, దర్జాగా తిరిగారని, ఇన్నాళ్లకు చంద్రబాబు పాపం పండిందన్నారు. ఆయన లూటీపై సీఐడీ అధికారులు ప్రశ్నిస్తే నాకు తెలీదు, గుర్తులేదు, మర్చిపోయాను అని సమాధానమిచ్చిన ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలు ఎలా గుర్తుపెట్టుకుని, నెరవేరుస్తాడని, రాష్ట్రాన్ని ఎలా ఏలుతాడని ప్రశ్నించారు. మరోసారి చంద్రబాబు మాయమాటలు నమ్మి, మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని జోష్యం చెప్పారు. ఎంపీ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధన ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, అందుకే ఆయన తొలుత పల్లెలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. 2019 ఎన్నికలకు ముందు మన ప్రాంతం ఎలా ఉంది.. ఇప్పుడు ఎలా ఉందన్న విషయం గమనించాలన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను ఆశీర్వదించి, ఆయనను మరోసారి సీఎంను చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. ఇప్పటివరకు 99 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రతీ కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరిందని, దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ, జనసేన పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మొద్దని, రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక సత్యనారాయణ, ఎంపీపీ ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ లూర్దు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ బొబ్బిలి, తెర్లాం మండలాల పార్టీ అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, ఎంపీడీవో ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

నవరత్నాలతో 'సంక్షేమ' కాంతులు



జోరువానలోనూ ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేరిట అమలు చేస్తున్న పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం మండలంలోని సంగాం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలను అమలు చేయడం జరుగుతోందని, ఏ ఇంటికీ వెళ్లినా చిరునవ్వుతో ఎంతో సంతోషంగా ప్రజలు సాదర స్వాగతం పలుకుతున్నారని, ఇదే ప్రభుత్వ మంచి పాలనకు నిదర్శమన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రభుత్వం పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా ఆ పార్టీ నేతలు, ఆ పార్టీ జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సుల మేరకే అందేవన్నారు. గతంలోని పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ గేదెల వెంకటనాయుడు, ఎంపీటీసీ గేదెల పారమ్మ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను విజయవంతం చేయండి

- ఎంపీడీవో రమామణి



రామభద్రపురం: అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి



బొబ్బిలి: అధికారులకు సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్



సంతకవిటి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రాజాం సిటీ: శిక్షణలో పాల్గొన్న వారితో మాట్లాడుతున్న అధికారులు

రామభద్రపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపీడీవో రమామణి కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో సోమవారం సమావేశమైన ఆమె ప్రజారోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేయనుందన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని అన్ని కుటుంబాలను కలిసి, ఎవరైనా ఆరోగ్య సమస్యలతో బాధపడితే ఏఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇచ్చేలా చూడాలన్నారు. 16వ తేదీ నుంచి ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలంతా ఇంటింటికీ వెళ్లి, వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రతిచోటా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు.

బొబ్బిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎంపీడీవో పోతుల రవికుమార్ సోమవారం సమావేశమై, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, ఎవరు ఏ రకమైన అనారోగ్యంతో బాధపడుతున్నారో వివరాలు సేకరించాలని, ఆ తరువాత వైద్యారోగ్య సిబ్బంది రోగుల ఇంటికి వెళ్లి, వైద్యసేవలందిస్తారన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి, ఎంఈవో సీహెచ్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఎంపీడీవో, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించి, ప్రజాసమస్యల పరిష్కారానికి వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్పందన కార్యక్రమ సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వంద శాతం చేయాలని ఎంపీడీవో రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలతో సమావేశమైన ఆయన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. వలంటీర్లు తమ పరిధిలోని ప్రతీ ఇంటిని సందర్శించి, ఆ ఇంట్లో ఉన్న వారు ఏ రోగాల బారినపడుతున్నారో వివరాలు సేకరించి, వైద్యారోగ్య సిబ్బందికి ఇవ్వాలన్నారు. అనంతరం ఏఎన్ఎంలు అవసరమైన వారి ఇంటికి వెళ్లి, వైద్యసేవలందిస్తున్నారన్నారు.

రాజాం సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపీడీవో బాసూరి శంకరరావు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బొద్దాం, పొగిరి పీహెచ్‌సీ ఆరోగ్య సిబ్బందికి కార్యక్రమ నిర్వహణపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టే ఈ కార్యక్రమం పక్కగా నిర్వహించాలని ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావు, బొద్దాం, పొగిరి పీహెచ్‌సీ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

చివరికి న్యాయమే గెలిచింది..

- ఎమ్మెల్యే కంబాల జోగులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఏసీబీ కోర్టు జైలుశిక్ష వేయడంతో చివరికి న్యాయమే గెలిచినట్లు అయిందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్న విషయం స్కిల్ స్కాంలో రూ.371 కోట్ల ప్రజాధనం లూటీ చేసిన చంద్రబాబుకు శిక్ష పడడంతో రుజువైందన్నారు. తప్పు చేసి, దొరికిపోయి ఇదంతా రాజకీయ కుట్రగా చిత్రీకరించే ప్రయత్నం టీడీపీ నేతలు, ఎల్లోమీడియా చేస్తోందని విమర్శించారు. చంద్రబాబు కుమారుడు లోకేష్ కన్నా ఆయన దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ ఎక్కువ చేసి, నేరం చేసిన వ్యక్తికి కొమ్ముకాయడాన్ని జనసేన పార్టీ వారికే నచ్చడం లేదన్నారు. నిరుద్యోగ యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు ఇస్తామని, ఉద్యోగులను చేస్తామని చెప్పి, రూ.3,356 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేసి, క్యాబినెట్‌ను కూడా చంద్రబాబు మోసం చేశారన్నారు. ఇందులో ప్రభుత్వం వాటా 10 శాతం అని, 90 శాతం సీమెన్స్ పెట్టుకుంటుందని, చెప్పి కోట్లు నొక్కేశారన్నారు. ఇదంతా చేసిందని వైఎస్సార్ సీపీ అని చెప్పుకుని తిరిగినంత మాత్రాన నిజం అబద్ధమైపోదు, అబద్ధం నిజమైపోదన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లడాన్ని నిరసిస్తూ రాష్ట్ర బంద్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చిందని, అయితే బంద్ పాక్షికంగా జరిగిందని, బంద్‌కు కూడా వచ్చేందుకు ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, కరణం సుదర్శనరావులు, దూబ గోపాలం, కోరాడ రామినాయుడు, తోట తిరుమలరావు, లక్ష్మణరావు, తవుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలి

- ఎంపీడీవో శంబంగి రామకృష్ణ



సమస్యలు పరిష్కరించినందుకు ఎంపీడీవో రామకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్న సర్పంచ్‌లు

తెర్లాం: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం కావాలని, ఆ దిశగా అధికారులంతా పనిచేయాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఒక్కో శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులు, జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి, సమస్యను పరిష్కరించాలన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే ఎందుకు ఆ సమస్యను పరిష్కరించలేకపోయామోనన్న విషయం అర్జీదారుకు వివరించాలన్నారు. సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఇదిలా ఉండగా, స్పందన కార్యక్రమంలో సకాలంలో తమ సమస్యలు పరిష్కరించినందుకు గాను ఎం.ఆర్ అగ్రహారం సర్పంచ్ లొట్టి లక్ష్మీ వెంకటరావు, విజయరాంపురం సర్పంచ్ బూరి మధుసూదనరావు ఎంపీడీవో, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

దోపిడీయే చంద్రబాబు విజన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: దోపిడీయే విజన్‌గా చంద్రబాబు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేశారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విమర్శించారు. సోమవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో మీడియా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.కోట్లు కొల్లగొట్టిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విషయంలో ఏసీబీ కోర్టు ప్రజలు మెచ్చేలా సంచలనాలత్మక తీర్పునిచ్చి, న్యాయదేవతకు కళ్లు ఉన్నాయని నిరూపించిందన్నారు. ప్రజాసంక్షేమాన్ని గాలికి వదిలేసి, అవినీతే అజెండాగా టీడీపీ పాలన సాగించిందని ఆరోపించారు. 1995లో ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, అధికారాన్ని కైవసం చేసుకుని అక్రమార్జనే లక్ష్యంగా వ్యవహరించారన్నారు. చంద్రబాబు అరెస్ట్ ప్రజల విజయమన్నారు. జనసేన అధినేత, చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, సీపీఐ నేత నారాయణ, సీపీఐఎం నేత రామకృష్ణ తమ పార్టీల సిద్ధాంతాలు పక్కనబెట్టి, అవినీతిపరుడుగా అభియోగాలు ఎదుర్కొంటూ కటకటాలపాలైన చంద్రబాబుకు మద్దతు పలకడం చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు. ఐటీ నోటీసులిచ్చినప్పుడు స్పందించని వారు చంద్రబాబు జైలుకెళ్లినప్పుడెందుకు స్పందిస్తున్నారని ప్రశ్నించారు. యువతకు నైపుణ్యం పేరిట రూ.కోట్లు దోచుకుంటే ఖండించాల్సింది పోయి ప్రోత్సహించి, వారి వ్యక్తిగత గౌరవాన్ని పోగొట్టుకుంటున్నారన్నారు. సుపుత్రుడు కన్నా దత్తపుత్రుడే ఎక్కువ హడావుడి చేస్తున్నాడన్నారు. ఆయనకు కూడా స్కిల్ స్కామ్ నుంచి వాటా అంది ఉంటుందని, చంద్రబాబు అరెస్ట్‌తో పవన్ ప్యాకేజీ పెరిగిందన్నారు. అవినీతి, ఆరోపణలతో జైలుపాలైన తొలి తెలుగు మాజీ సీఎంగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారని, ఆయన చేసిన తప్పులకు ఆయన కటకటాలపాలు కావడాన్ని అందరూ హర్షిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు



పొలాల్లో బస్సు

రాజాం సిటీ: మండల పరిధి ఒమ్మి పంచాయతీ కొత్తపేట సమీపంలో సోమవారం రాజాం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఒక్కసారిగా పశువులు రోడ్డుపైకి రావడంతో వాటి ని తప్పించే క్రమంలో ఇలా జరిగిందని స్థానికులు తెలిపారు. బస్సు పొలాల్లోకి దూసుకెళ్లిన సమయంలో ఏం జరుగుతుందోనన్న భయాందోళనతో ప్రయాణికుల హాహాకారాలు మిన్నంటాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే బస్సు తీయడానికి వీలులేకపోవడంతో ప్రయాణికులను ఇతర వాహనాల ద్వారా తరలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: స్థానిక చీపురుపల్లి రోడ్డులో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కుమార్ ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు చేయనున్న నేపథ్యంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు కొండకెంగువలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రామభద్రపురం: మండలంలోని కొండకెంగువ గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. అనివార్య కారణాల వల్ల సోమవారం జరగాల్సిన ఈ కార్యక్రమంను వాయిదా వేయడం జరిగిందని, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

24న పద్యపఠన పోటీలు



పద్యపఠన పోటీల కరపత్రం ఆవిష్కరిస్తున్న వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి కార్యాలయంలో ఈ నెల 24వ తేదీన నియోజకవర్గ స్థాయి పద్య పఠన పోటీలు నిర్వహించనున్నామని వికాస తరంగిణి కేంద్ర సమన్వయకర్త టి.టి.వి.రమణమూర్తి తెలిపారు. సోమవారం ఈ పోటీలకు సంబంధించి, రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించి, ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా కరపత్రంలో ముద్రించిన పద్యాలు మాత్రమే సాధన చేసి, ప్రదర్శించాలన్నారు. 4, 5 తరగతుల విద్యార్థులు కోరిన పద్యాన్ని చెప్పాలని, 6, 7 తరగతుల విద్యార్థులు కోరిన పద్యంతో పాటు దాని భావం కూడా చెప్పాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ముఖ్య సమన్వయకర్త అమనాన నీలకంఠం, కోశాధికారి వాకచర్ల వెంకట పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి కలిగి ఉండాలి



ఐటీఐ కాలనీలోని డిపెప్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు

బొబ్బిలి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పథకం కింద ఇచ్చే మధ్యాహ్న భోజనం రుచి, శుచి కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పట్టణంలోని నేతాజీ, తాండ్రపాపారాయ, డిపెప్ పాఠశాలలను సోమవారం సందర్శించిన ఆయన అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, నాడు–నేడు భవనాలు, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. అన్నం కొద్దిగా గట్టిగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన ఇలా అయితే ఎలా అని వంట నిర్వాహకులను ప్రశ్నించారు. మెనూ ప్రకారం బాగా వంటలు చేసి, విద్యార్థులకు భోజనం పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు

రేగిడి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకటాపురం, ఖండ్యాం గ్రామాల్లో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించి, పలువురికి వైద్యుడు అసిరినాయుడు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది సూచించారు.